సాక్షి
నారాయణపేట
శుక్రవారం । 17 । మే । 2024



అవినీతి అధికారిపై విచారణ

వ్యవసాయ శాఖలో అవినీతికి పాల్పడిన అధికారిపై విచారణ కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸



మూడు వారాల ఉత్కంఠ

లోక్‌సభ ఫలితాల కోసం మూడు వారాలు ఉండటంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.2 /23.4

ఎండ తీవ్రత కాస్త తక్కువగా ఉంటుంది. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట రూరల్: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేష్‌గౌతమ్ ఒక ప్రకటనలో సూచించారు. అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారికి సెల్ ఫోన్ ఇవ్వడం చేయరాదని, అనవసరమైన లింకులు మెబైల్‌కు వస్తే ఓపెన్ చేయరాదని, లాటరీ తగిలిందని, తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్ముతున్నట్లు ప్రకటనలు చూసి మోసపోవద్దని తెలిపారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని,ఓటీపీ వివరాలు చెప్పాలని అడిగినా ఎట్టిపరిస్థితుల్లో చెప్పవద్దని, తమ వ్యక్తిగత వివరాలు ఎవరికి షేర్ చేయరాదని, ఎక్కడైన అనుమానం వస్తే వెంటనే టోల్‌ఫ్రీ నం. 193కుగాని డయల్ 100, 112లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు డిబార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో గురువారం డిగ్రీ 2, 6వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 49 కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉదయం జరిగిన రెండో సెమిస్టర్ పరీక్షకు 11,848 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 11,227 మంది హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం జరిగిన ఆరో సెమిస్టర్ పరీక్షకు 11,448 మందికిగాను 11,108 మంది హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా, కొండనాగులలో ఇద్దరు, నాగర్‌కర్నూల్‌లో ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ అధికారులకు పట్టుబడగా.. డిబార్ చేసినట్లు పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజ్‌కుమార్ తెలిపారు.

పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలి

నారాయణపేట: ఈ నెల 17 నుండి 31 వరకు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా పండించిన వరిని రక్షించుకోవడానికి రైతులు రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలతో తెలిపారు. పండించిన వరి గింజలు తడవకుండా నిల్వ చేసుకోవాలని, వరి గింజలను కప్పడానికి టార్పాలిన్లు ఉపయోగించాలని, ఆరుబయట ఆరవేయద్దని సూచించారు.

జూరాలకు 2,451 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లోలు వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. లోకల్ వర్షాలతో పాటు ప్రాజెక్టు ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి గురువారం జూరాల ప్రాజెక్టుకు 2,451 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 2.907 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ప్రాజెక్టు నుంచి 125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

సేవల సౌలభ్యానికి సర్వే

'మక్తల్ మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 21వేల మంది పేర్లు నమోదయ్యాయి. అయితే, ఇటీవల నిర్వహించిన కుటుంబ సర్వేలో వారి వివరాలు, ఆధార్ కార్డుల నమోదు చేపట్టగా 18 వేల మంది మాత్రమే వివరాలు నమోదయ్యాయి. ఈ యాప్ ద్వారా మైగ్రేషన్‌లో ఉన్న వారి సంఖ్య తేలనుంది. దీంతో పాటు కొంత మంది లబ్ధిదారులు తప్పుడు నమోదు, రెండు సెంటర్‌లలో చేయించుకుంటే వాటి నమోదు ఈ సర్వే ద్వారా బయటపడనుందని నారాయణపేట ఎస్‌ఓ ఐసీడీఎస్ శ్రీలత వివరించారు'



నర్వ మండలం పెద్దకడ్మూర్‌లో కుటుంబ సర్వే చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అంగన్‌వాడీల కుటుంబ సర్వే

- వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు
- రెండు యాప్‌లలో వివరాలు క్రోడీకరణ
- సర్వేతో దొంగ రిజిస్ట్రేషన్ల నివారణ

నర్వ: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ, గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులకు అందించే సేవల్లో మార్పులు తీసుకొచ్చేందుకు అంగన్‌వాడీ కుటుంబ సర్వే మొదలుపెట్టారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ టీచర్లు సర్వే నిర్వహిస్తున్నారు. కేంద్రం ఒక చోట ఉంటే లబ్ధిదారుల ఇళ్లు ఇంకో చోట ఉండటంతో చిన్నారులకు పోషకాహారం, గర్భిణులు, బాలింతలకు సేవలందించడంలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. లబ్ధిదారులు కేంద్రాన్ని చేరుకోవడానికి అవస్థలు పడాల్సి వస్తోంది. సమీపంలో ఉన్న కేంద్రాన్ని వదిలిపెట్టి దూరాన ఉన్న కేంద్రానికి కేటాయించడంతోనే ఇలాంటి పరిస్థితి తలెత్తింది. వీటన్నింటిని దృష్టిలో ఉంచకోని పరిష్కారం దిశగా మార్పులు తీసుకొచ్చే ప్రయత్నమే ఈ సర్వే అని అధికారులు అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 704 కేంద్రాల పరిధిలో ఉన్న ఇళ్ళను పరిగణలోకి తీసుకోని ఈ సర్వే చేస్తున్నారు.

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు..

సర్వే ఆధారంగా వివరాలు సేకరించిన సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన రెండు రకాల యాప్‌లలో సర్వేను ఒకే సారి పొందుపరుస్తున్నారు. కేంద్రాన్ని ఆధారంగా చేసుకొని ఇంటి నెంబర్, కాలనీ పేరు, చిన్నారులు, తల్లిదండ్రులు గర్భిణులు, బాలింతలు, జనన, మరణాలు, ఇల్లు ప్రస్తుతం ఉన్న కేంద్రం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. సర్వే రెండు విధాలుగా ఉంది. ఒకటి రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి, మరోటి కేంద్రప్రభుత్వానిది. సర్వే అనంతరం కేంద్రాలకు సంబంధించి ఇళ్ల సర్దుబాటు ప్రక్రియ చేపడతారు. కేంద్రానికి దూరంగా ఉండే ఇళ్లను సమీపంలో ఉన్న కేంద్రానికి దూరంగా ఉండే ఇళ్ళను సమీపంలో ఉన్న కేంద్రానికి బదిలీ చేస్తారు. ఒక కేంద్రానికి 250 ఇళ్ళ నుంచి 300 ఇళ్ళు ఉండేలా సర్దుబాటు చేయనున్నారు.

పకడ్బందీగా చేపడుతున్నాం

కుటుంబ సర్వే నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపడుతున్నాం. జిల్లాలోని ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది సర్వే చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ సక్రమంగా జరిగేందుకు, అక్రమ రిజిస్ట్రేషన్‌ల తొలగింపు, మేగ్రేషన్ తది అంశాలను సర్వేలో చేపట్టనున్నారు. ఈ సర్వేతో లబ్ధిదారుల ఉత్తమ సేవలకు ఉపయోపగడనుంది. చాలా మంది పట్టణాల్లో లబద్ధిదారులు అద్దె ఇళ్లల్లో మారుతుంటారు. అలాంటి వారికి ప్రాధాన్యమిస్తూ సర్వే చేస్తున్నారు. సర్వే పూర్తిస్థాయిలో పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– నర్సింగ్‌రావు, డీడబ్ల్యూఓ, నారాయణపేట



చైతన్య కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం లేదు

- పట్టణప్రాంతంలో తగ్గిన ఓటింగ్ శాతం
- బాధ్యత మరుస్తున్న యువత

4,63,983 మంది ఓటుకు దూరం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు చాలా కీలకమైంది. ఓటు బ్రహ్మాస్త్రంతో దేశ భవితను మార్చే అవకాశముంది. ఓటుతో మంచి నాయకుడిని ఎన్నుకోవడం ద్వారా మన ప్రాంతమే కాకుండా దేశ దశ దిశను మార్చే శక్తి ఓటుకే ఉంది. ఒక్క ఓటు తేడాతో ఓడిన వారి చాలా మందే ఉన్నారు. అందుకే ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు జిల్లా అధికార యంత్రాంగం విస్తృతంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతపై పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించాయి. పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ నెల 13న నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల్లో చాలా మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 16,82,470 మంది ఓటర్లు ఉండగా, అందులో 12,18,487 మంది తమ ఓటుహక్కును వినియోగించున్నారు. మిగతా 4,63,983 మంది ఓటు వేయలేదు. పార్లమెంట్ నియోజకవర్గంలో 72.42 శాతం పోలింగ్ కావడం గమనార్హం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 13, 68,868 మంది ఓటర్లు ఉండగా అప్పట్లో 9,26,516 (67.68శాతం) ఓట్లు పోలయ్యాయి. అప్పటికి ఇప్పటికీ చూస్తే 3,13,602 మంది ఓటర్లు పెరిగినప్పటికీ పోలింగ్ శాతం తక్కువగా నమోదు కావడం, ఓటుకు దూరంగా ఉన్నవారి సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

గుర్తింపు కార్డు కోసమే..

ఓటరు జాబితాలో పేరు నమోదుకు ఎంతో శ్రద్ధ చూపెట్టారు. 18 ఏళ్లు నిండిన వెంటనే ఓటు నమోదు చేయిస్తారు. ఎన్నికల గుర్తింపు కార్డు రాకుంటే అధికారులతో మాట్లాడి తీసుకుంటారు. ఓట్ల పండగ వచ్చే సరికే దూరంగా ఉంటున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర ప్రాంతాల్లో ఉంటే పిలవడం లేదు. దూరభారం అవుతుందని ఎందుకు ఇంతదూరమని చెప్పడంతో వారు కూడా వచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు. ఓటరు కార్డును ఒక గుర్తింపు కార్డు కోసమే వాడుతున్నారు.

■ పట్టణాల్లో ఓటు వేసేందుకు చాలా మంది వెనుకడుగు వేశారు. ప్రతి ఎన్నికల్లో ఇదే పరిస్థితి. మహబూబ్‌నగర్ అర్బన్, జడ్చర్ల, నారాయణపేట, షాద్‌నగర్ పట్టణ ప్రాంతాల్లో కొత్త ఓటర్లు వేలల్లో పెరుగుతున్నారు. ఓటింగ్ శాతం చూస్తే తక్కువగా ఉంటుంది.

నియోజకవర్గం	ఓటర్లు	పోలైన ఓట్లు	ఓటేయని వారు
కొడంగల్	2,41,794	1,71,776	70,018
నారాయణపేట	2,36,182	1,63,284	72,898
మహబూబ్‌నగర్	2,59,260	1,71,815	87,445
జడ్చర్ల	2,22,838	1,73,634	49,204
దేవరకద్ర	2,39,745	1,78,602	61,143
మక్తల్	2,44,173	1,74,898	69,275
షాద్‌నగర్	2,38,478	1,84,478	54,000
మొత్తం	16,82,470	12,18,487	4,63,983

డెంగీ నివారణకు కృషిచేద్దాం



డెంగీ నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యబృందం

నారాయణపేట రూరల్: ప్రాణాంతకమైన డెంగీ వ్యాధి నివారించేందుకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ముందుకురావాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయం దగ్గర ఆమె జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించగా వైద్య సిబ్బంది వీరసవార్కార్ చౌరస్తా వరకు నినాదాలు చేస్తూ వెళ్లి అక్కడ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమను తాము శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా సోకే ప్రమాదం ఉంటుందని, తద్వారా హ్యూమినిటీ పవర్ తగ్గిపోతుందని ఆమె అన్నారు. దోమల నియంత్రణతో చాలా రకాల రోగాలను రాకుండా చర్యలు చేపట్టవచ్చని, ముఖ్యంగా వర్షాకాలంలో ఎక్కువగా విస్తరించే అవకాశం ఉండటంతో ముందస్తుగా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వ్యాధి సోకిన వారు నిర్ధారణ అయిన వెంటనే అవసరమైన చికిత్సను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శైలజ, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాఘవేందర్, డాక్టర్ సాయిరాం, డీపీఓ బిక్షపతి, డాక్టర్ బాలాజీరావు, నర్సింహారావు సగరి, శృతి, నవ్యదీప్తి, చందన, విజయ్‌ప్రకాష్, గోవింద్‌రాజు, అశోక్ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ సౌభాగ్యలక్ష్మి

జొన్నలు @ రూ.4,715

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం జొన్నలు క్వింటా గరిష్టంగా రూ.4,715, కనిష్టంగా రూ.3,355 ధర పలికింది. అలాగే, వడ్లు హంస గరిష్ట, కనిష్టంగా రూ.1,930, వడ్లు సోనా గరిష్టంగా రూ.2,505, కనిష్టంగా రూ.1,821 ధరలు పలికాయి.

సోనామసూరి ధర రూ. 2,382..

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం జరిగిన టెండర్లలో సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 2,382, కనిష్టంగా రూ. 2,243 ధర పలికింది. ధాన్యం సీజన్ ముగుస్తుండటంతో మార్కెట్‌కు 500 బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల స్వీకరణ

వనపర్తిటౌన్: గిరిజన వ్యవహారాల మంత్రి శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ అభ్యర్థుల నుంచి నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎం. శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్ పొందాలనుకునే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మాస్టర్స్, పీహెచ్‌డీ రీసెర్చ్ ప్రోగ్రాం కోసం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 31వ, తేదీలోగా overseas.tribal.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

దోపిడీ వ్యవస్థపై పోరాటం చేయాలి



మాట్లాడుతున్న ఎం.హన్మేస్

నారాయణపేట: దోపిడీ, పెట్టుబడిదారి వ్యవస్థపై పోరాటం చేయాలని అప్పుడే సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు ఎం.హన్మేస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతులకు రెండవ రోజు డివిజన్ కార్యదర్శ కె.కాశీనాథ్ అధ్యక్షత వహించగా ఆయన జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులపై శిక్షణనిచ్చారు. హన్మేస్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద దేశాలు తమ మార్కెట్ కోసం కొట్లాడుతున్నాయన్నారు. మనం కార్పొరేటు పెట్టుబడి దారి విధానానికై సామ్రాజ్యవాదానికి, యుద్దాలకు వ్యతిరేకంగా కొట్లాడాలన్నారు. దేశంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి విషయాన్ని దేశభక్తి, మతంతో ముడిపెట్టి పాలన కొనసాగిస్తున్నారని, దేశ సంపదను, ప్రభుత్వ సంస్థలను ఆదానీ, అంబానీ లాంటి పెద్ద పెట్టుబడిదారులకు అప్పజెబుతున్నాడన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్ ప్రపంచ ఆకలి పట్టికలో 94 స్థానానికి ఎగబాకిందన్నారు. వీటిని ప్రశ్నించిన వారిని దేశద్రోహులంటూ జైల్లో వేస్తున్నారని, మోదీ పెంచి పోషిస్తున్న మూడవిశ్వాసాలను, కార్పొరేట్ శక్తులను మట్టి కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. జిల్లా కార్యదర్శి బి.రాము, సలీం, జయలక్ష్మి ,బోయిన్పల్లి రాము, కిరణ్ కాలేశ్వర్ యాదగిరి తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాహం తీరినట్లే..!

- నీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు
- నారాయణపూర్ నుంచి జూరాలకు 1.9 టీఎంసీల నీటి విడుదల



జూరాల ప్రాజెక్టులో బ్యాక్‌వాటర్

అమరచింత: ఉమ్మడి పాలమూర్ జిల్లా వ్యాప్తంగా తాగునీటిని అందిస్తున్న జూరాల ప్రాజెక్టు జలాశయం రోజురోజుకు తగ్గుముఖం పడుతుంది. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎగువన ఉన్న నారాయణపూర్ డ్యాం నుంచి తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరింది. దీంతో స్పందించిన కర్ణాటక ప్రభుత్వం అడిగిన రెండు టీఎంసీల నీటిని ఇవ్వలేమని, ప్రస్తుతానికి 1.9 టీఎంసీల నీటిని విడుదల చేసింది. దీంతో ఐదు రోజుల నుంచి నెమ్మదిగా జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న నీటితో రోజురోజుకు ఇన్‌ఫ్లో పెరిగిపోతుండటంతో ఇక వేసవిలో తాగునీటి కష్టాలు గట్టెక్కినట్లేనని అధికారులు తెలియజేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు తాగునీటితో పాటు సాగు, విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని అందించే ప్రాజెక్టుగా పేరుగాంచింది. కాని వరదలు వచ్చినప్పుడు అత్యధికంగా నీటిని నిల్వ ఉంచుకోలేని పరిస్థితిలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడంతో కేవలం 11 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉంచుకుని, మిగిలిన నీటిని దిగువకు వదులుతున్న పరిస్థితులు దాపురించాయి.

జూరాలపై ఆధారపడిన తాగునీటి పథకాలు..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు తాగునీటిని అందించేందుకు శ్రీకారం చుట్టారు. రామన్‌పాడ్ రిజర్వాయర్‌తో పాటు జూరాల ప్రాజెక్టుతో మొత్తంగా 17 తాగునీటి పథకాలకు నిత్యం నీటిని అందిస్తున్నారు. ఆత్మకూర్, అమరచింత, వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, దేవరకద్ర, మహబూబ్‌నగర్, షాద్‌నగర్‌కు తాగునీటిని అందించే పథకాలను వీటిపై ఏర్పాటు చేశారు. ప్రజల దాహార్తిని దృష్టిలో ఉంచుకున్న అధికారులు జూరాల నుంచి ఆయకట్టుకు కేవలం వారబంది ద్వారా పంటల సాగుకు నీటిని అందిస్తున్నారు. గతేడాది వర్షాలు అనుకున్న విధంగా కురవకపోవడంతో యాసంగిలో జూరాల ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించారు. అయినా తాగునీటిని వేసవి పూర్తినాటికి అందిచలేమని గ్రహించిన ప్రాజెక్టు అధికారులు, విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మంత్రి జూపల్లి కృష్ణారావు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఎగువన కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు తాగునీటి అవసరాలకు నీటిని నారాయణపూర్ డ్యాం ద్వారా విడుదల చేసింది.

ప్రభుత్వం చొరవతోనే..



రాష్ట్ర ప్రభుత్వం చొరవతోనే ఎగువన ఉన్న కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ డ్యాం నుంచి 1.9 టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేసింది. వేసవిలో ప్రజలకు పూర్తిస్థాయిలో నీటి ఇబ్బందులు కలుగకుండా జూరాలలో నీటి నిల్వను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం జూన్ చివరి నాటికి తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– జగన్మోహన్, ఈఈ

సమస్య పరిష్కారానికి..



జూరాల ప్రాజెక్టుపై ఆధారపడిన తాగునీటి పథకాలకు వేసవి కాలం పూర్తయ్యే నాటికి నీటిని అందించాలనే ఉద్దేశంతో సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సమస్యను నివేదించాం. తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని కోరగా సానుకూలంగా స్పందించిన కర్ణాటక ప్రభుత్వం 1.9 టీఎంసీల నీటినివిడుదల చేసింది.

– వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే మక్తల్

పాఠశాలల్లో ప్రగతి పనులు వేగవంతం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- అమ్మ ఆదర్శ కమిటీలపై సమీక్ష

నారాయణపేట: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మౌలిక వసతుల నిర్మాణ పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు సంబంధించిన అభివృద్ధి నిర్మాణ పనులపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జూన్ 30 లోపు పాఠశాలలో వివిధ నిర్మాణ, అవసరమైన మరమ్మతు పనులను పూర్తి చేస్తే, జూన్ మొదటి వారంలో పాఠశాలలకు రంగులు వేయించాలన్నారు.

మరికల్‌లోని పాఠశాలలను పరిశీలించి, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎస్టిమేట్ తయారు చేసి ఇవ్వాలని, అలాగే మద్దూరు, కోస్గి మండలాల్లో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. కేజీబీవీ పాఠశాల ప్రహరీల పనులకు ఊట్కూరు మండలంలోని కొల్లూరు, పెద్దపొర్ల , మొగ్దుంపూర్ పాఠశాలల్లో ప్రతిపాదించిన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. మాగనూర్ మండలంలోని వడ్వాట్ గ్రామ పాఠశాలలో ఎందుకు పనులు నిలిచిపోయాయని ప్రశ్నించారు. సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, డిఆర్‌డిఓ రాజేశ్వరి, సిపిఓ జీవరత్నం, అడిషనల్ డీఆర్డీఓ అంజయ్య, విద్యా శాఖ అధికారులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్‌లు సిద్ధం చేయాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కొత్త యూనిఫామ్‌లను తయారు చేయాలని కలెక్టర్ కోయశ్రీ హర్ష సూచించారు. కలెక్టరేట్‌లో మహిళా సంఘాల ద్వారా స్కూల్ యూనిఫామ్‌ల తయారీపై డీఆర్‌డీఏ, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బల్క్ క్లాత్ శుక్రవారం వస్తుందని, నెల 20 నుంచి యూనిఫాంల స్టిచ్చింగ్ (కుట్టే) ప్రక్రియను ప్రారంభించాలన్నారు. రోజూ ఎన్ని జతల యూనిఫామ్‌లు కుట్టారనే వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. జిల్లాలోని మహిళా సంఘాలలో ఎంతమంది మహిళా టైలర్లు ఉన్నారు, వారి వద్ద కుట్టు మిషన్లు, సామగ్రి అందుబాటులో ఉందా అరా తీశారు. అడిషనల్ డిఆర్డిఓ అంజయ్య, విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం సేకరణ లక్ష్యాన్ని చేరుకోవాలి

ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన వరి ధాన్యం సేకరణ లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ శ్రీ హర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో సివిల్ సప్లై, డీఆర్‌డిఏ, పిఎస్‌ఈఎస్, మార్కెటింగ్ శాఖ అధికారులతో మాట్లాడారు. జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు, ఇంకా ఎంత సేకరించాల్సి ఉందని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఇంకా 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ కలెక్టర్‌కు తెలిపారు. మద్దూరు, కోస్గి మండలాల నుంచి ఇంకా ధాన్యం రావాల్సి ఉందని వ్యవసాయాధికారి తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ఇచ్చిన తేమ శాతం యంత్రాలు, టార్పాలిన్లను కేంద్రాలు మూసిన తర్వాత తిరిగి తీసుకోవాలని ఆదేశించారు. రైస్ మిల్లర్ల సీఎంఆర్ లక్ష్యం ఎంత వరకు వచ్చిందని, నిర్లక్ష్యం చేసే రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని, పది శాతం కంటే తక్కువ ఏసికె ఉన్న రైస్ మిల్లర్లకు నోటీసులు ఇవ్వాలన్నారు. ఈసమావేశంలో సివిల్ సప్లై డిఎం దేవదాస్, డీఎస్‌ఓ సుదర్శన్, డిఆర్డిఓ రాజేశ్వరి, డీటీ కాశప్పలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెబ్బేరురూరల్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కంచిరావుపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గురువారం మృతుడి భార్య బంగి పల్లవి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపారు. ఎరవల్లి మండలం పుటాన్‌దొడ్డికి చెందిన బంగినరసింహ (35) ఎలక్ట్రిషన్‌గా కంచిరావుపల్లి శివారులోని పౌల్ట్రీ ఫాంలో పనిచేస్తున్నాడు. కుటుంబంతో కలిసి అక్కడే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం కరెంట్ సమస్య ఉండంతో స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా షాక్ తగిలి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

కృష్ణా: కర్ణాటకలోని రాయచూర్ జిల్లా జేర్కల్ చెందిన దండు మహదేవ్(46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని ఎస్‌ఐ నవీద్ గురువారం తెలిపారు. పదేళ్ల క్రితమే సునీతతో వివాహం కాగా, కుమారు డు, కూతురు ఉన్నారు. కొంతకాలం క్రితం ఇంట్లో గొడవల కారణంగా ఆయన తన తల్లితో మల్లాపూర్‌లో ఉంటున్నారు. కాగా అక్కడ మద్యానికి బానిసై ఊర్లవెంటా తిరిగే వాడని ఎస్‌ఐ తెలిపారు. వారం రోజుల క్రితం ఈ ప్రాంతానికి వచ్చి తాగిన మైకంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని వివరించారు. ఉదయం గుడెబల్లూర్ శివారులోని శివయ్య వ్యవసాయ పొలంలో మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు తమకు సమాచారం అందించారని చెప్పారు. విషయంపై కేసు నమోదు చేసుకొని, ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంట్లో ఉరేసుకుని యువతి బలవన్మరణం

అమరచింత: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన హసన్, షరీఫాబీ దంపతుల కూతురు ఖాజాబీ(24) డిగ్రీ వరకు చదువుకుంది. ఈనెల 30న ఆత్మకూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తితో పెళ్లి ఖరారు చేశారు. ఈ క్రమంలో పెళ్లి దుస్తుల కోసం గురువారం తల్లితండ్రులు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఖాజాబీ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ వ్యవహారంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపారు.

పిడుగు పాటుకు రెండు ఆవులు మృతి



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌లో గురువారం కురిసిన వర్షానికి పిడుగు పడి రెండు పాడిఆవులు మృతి చెందాయి. ద్యాప అమరేందర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో కట్టేసి ఉంచిన కాడే ఎద్దు, నెంట శ్రీను చెందిన పాడిఆవు పిడుగుపాటుకు మృతి చెందాయి. ఒక్కో పశువు విలువ దాదాపుగా రూ.60వేలు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

నిందితులను అరెస్ట్ చేయాలని ఫిర్యాదు



మహబూబ్‌నగర్ క్రైం: అడ్డాకుల మండలం బలీదుపల్లికి చెందిన శ్రీకాంత్ యాదవ్‌పై దాడి చేసి మరణానికి కారకులైన వారిని అరెస్ట్ చేయాలని బాధిత కుటుంబ సభ్యులతో పాటు అడ్డాకుల యాదవ సంఘం నాయకులు గురువారం అదనపు ఎస్పీ రాములుకు వినతి పత్రం అందించారు. మద్యం దుకాణం యాజమాన్యంపై మర్డర్ కేసు నమోదు చేసిన, ఇంకా అరెస్టు చేయలేదన్నారు. మద్యం దుకాణం ఓపెన్ చేసి వ్యాపారం చేస్తున్నారని, ఇప్పటికైన ఎక్సైజ్ అధికారులు స్పందించి దుకాణం లైసెన్స్ రద్దు చేయాలన్నారు.

డీసీఎం డ్రైవర్‌పై కేసునమోదు

అడ్డాకుల: రోడ్డు ప్రమాద ఘటనలో బాధితుల ఫిర్యాదుతో మధ్యప్రదేశ్‌కు చెందిన డీసీఎం డ్రైవర్ నరేందర్ రాజవత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈనెల 14న అడ్డాకుల సమీపంలోని గోల్డెన్ హోటల్ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై డీసీఎం కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుడిబండకు చెందిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయని వివరించారు. ఈ మేరకు గురువారం బాధిత కుటుంబానికి చెందిన పెద్ద మైబు ఫిర్యాదు చేశారని తెలిపారు.

అవినీతి అధికారిపై విచారణ

- నాగర్‌కర్నూల్ వ్యవసాయశాఖలో ఓ అధికారిపై కమిషనరేట్‌లో ఫిర్యాదు
- ఆర్‌ఏహెచ్ స్కీంలో గోల్‌మాల్‌కు పాల్పడినట్లు ఆరోపణలు
- గుట్టుగా విచారణ చేపట్టిన మరో జిల్లాస్థాయి అధికారి
- సదరు అధికారి తీరు ఆది నుంచి వివాదాస్పదమే..



నాగర్‌కర్నూల్: జిల్లా వ్యవసాయ శాఖలో ఓ అవినీతి అధికారిపై గుట్టుగా విచారణ కొనసాగుతోంది. ఆర్‌ఏహెచ్ స్కీంలో సదరు అధికారి చేతివాటం ప్రదర్శించాడని వ్యవసాయశాఖ కమిషనరేట్‌లో పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు.. విచారణ చేపట్టి, నివేదిక సమర్పించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు జిల్లాస్థాయి అధికారికి విచారణ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. రెండు రోజుల కిందటి వరకు పార్లమెంట్ ఎన్నికల హడావుడి ఉండటంతో సదరు అవినీతి అధికారిపై విచారణకు బ్రేక్ పడింది. ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో మరో 10 రోజుల్లో విచారణ పూర్తి చేసి, కలెక్టర్‌కు పూర్తి నివేదిక అందించనున్నట్లు తెలుస్తోంది.

ఆది నుంచి వివాదాలే..

విచారణ ఎదుర్కొంటున్న సదరు అధికారి ఆది నుంచి వివాదాస్పదుడే. గతంలో మండలంలోని ఓ జాతరలో మద్యం తాగి రైతులకు అందించాల్సిన పథకాలపై బాధ్యతారాహిత్యంగా మాట్లాడడంతో కొందరు వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిసింది. అయితే దీనిపై కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో సదరు అధికారి మరింత పేట్రేగిపోయారు. తనను ఎవరు ఏం చేయలేరు.. ఎక్కడ ఫిర్యాదు చేసినా సరే అన్నట్టుగా తన వ్యవహారం కొనసాగింది. కింది స్థాయి సిబ్బందిని సైతం పలు కారణాలతో ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రస్తుతం చేపట్టిన విచారణ సక్రమంగా జరుగుతుందా.. లేదా అన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ పథకంలో కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు అందరూ భాగస్వాములుగా ఉన్నారన్న ఆరోపణలు లేకపోలేదు. కాగా.. ఈ విషయం నిజమేనని వ్యవసాయశాఖలో పలువురు అధికారులు చెబుతుండగా.. విచారణ చేపట్టిన సదరు అధికారిని 'సాక్షి' సంప్రదించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

అసలేం జరిగిందంటే...

కరువు పరిస్థితులతో వ్యవసాయానికి దూరమైన రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఆర్‌ఏహెచ్ స్కీం ప్రవేశపెట్టగా.. జిల్లా పరిధిలోని కొన్ని గ్రామాలను ఎంపిక చేశారు. ఈ పథకం ద్వారా రైతులకు గేదెలు, గొర్రెలు, కోళ్లు, మొక్కలను సబ్సిడీపై అందించాలని నిర్ణయించారు. అయితే, గేదెల కోసం లబ్ధిదారు వాటాగా రూ.27 వేలు చెల్లించాల్సి ఉండగా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.1.16 లక్షల సబ్సిడీ వస్తోంది. రైతుల ఇష్టం మేరకు 100 కిలోమీటర్ల లోపు జరిగే సంతల్లో గేదెలను ఇప్పించాల్సి ఉంది. సంబంధిత అధికారులు మాత్రం ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ముందుగానే ఏర్పాటు చేసుకున్న ఏజెంట్లతో కమీషన్ మాట్లాడుకొని తక్కువ ధరకు వచ్చే గేదెలను ఎక్కువ ధరకు ఇప్పించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గత ఫిబ్రవరి 5న ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వ్యవసాయశాఖ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. రైతులను నష్టపర్చడమే కాకుండా.. ఫిర్యాదు చేసిన రైతులను బెదిరించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. సదరు అధికారితో పాటు మరో మహిళా అధికారితో కలిసి ఈ తతంగం నడిపించారని తెలుస్తోంది.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



బాదేపల్లి యార్డు ఆవరణలో ధాన్యం కుప్పలు

- బాదేపల్లి యార్డులో రైతుల అగచాట్లు

జడ్చర్ల: పంట దిగుబడులను అమ్ముకుపోయేందుకు వచ్చిన రైతులను అకాల వర్షం ఇబ్బందుల పాలు చేసింది. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో అమ్మకానికి పోసిన ధాన్యం కుప్పలు అకాల వర్షంతో తడిసిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి గురువారం 10వేల క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. వర్షం వచ్చిన సమయంలో ధాన్యం కుప్పలపై ప్లాస్టిక్ కవర్లు కప్పినా యార్డు ఆవరణంతా సిమెంట్ నిర్మాణం ఉండడంతో వర్షం వచ్చిన వెంటనే వరద నీళ్లు రాసుల కిందకు పోయాయి. షెడ్‌లలో ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన దిగుబడులను తరలించడంలో ఆలస్యం చోటు చేసుకోవడం కారణంగా కూడా షెడ్‌లలో స్థలం సరిపడక ఆరుబయట పోయాల్సి వస్తుందని రైతులు తెలిపారు. వ్యాపారులు తడిసిన ధాన్యానికి తక్కువ ధరలు కేటాయిస్తారని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యానికి కూడా మంచి ధరలు కేటాయించి తమకు న్యాయం చేయాలని కోరారు.



బాదేపల్లి యార్డులో తడిసిన ధాన్యం

షెడ్లు నిర్మించాలి



బాదేపల్లి యార్డుకు పెద్ద ఎత్తున పంట దిగుబడులు వస్తుంటాయి. సీజన్‌లో స్థలం సరిపోని పరిస్థితి ఉంటుంది. పంట దిగుబడులకు అనుగుణంగా షెడ్‌ల నిర్మాణం చేపట్టాలి. దిగుబడులు తడవకుండా చర్యలు తీసుకోవాలి.

– వెంకట్రాములు, రైతు, బండమీదిపల్లి

ధాన్యం క్వింటాల్ రూ.2,481

బాదేపల్లి యార్డులో ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ రకం క్వింటాల్ గరిష్టంగా రూ.2,481, కనిష్టంగా రూ.1,905 ధరలు పలికాయి. మొక్కజొన్న గరిష్టంగా రూ.2,271, కనిష్టంగా రూ.1,909, ఆముదాలు రూ.5,471 ధరలు లభించాయి.

కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా

- 9 మందికి తీవ్ర, 13 మందికి స్వల్ప గాయాలు



గాయపడిన మహిళలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ: వ్యవసాయ పనులకు కూలీలను తరలిస్తున్న ఆటో బోల్తా పడడంతో మహిళలకు గాయాలైన ఘటన గురువారం పట్టణ సమీపంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వెంకటేష్ తన వ్యవసాయ పొలంలో వేరుశనగ పైరులో కలుపు తీయించేందుకు కూలీలను సొంత ఆటోలో 26 మందిని ఎక్కించుకుని బయలుదేరాడు. ఈ క్రమంలో గద్వాల రోడ్డు పక్కన ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడింది. రోడ్డుపై వెళ్తున్న కొందరు వ్యక్తులు ఆటోను పైకి లేపారు. ఆటోలో ప్రయాణిస్తున్న జానకమ్మ, సరోజమ్మ, పార్వతమ్మ, బాయికాటి సరోజ, మహేశ్వరమ్మ, నాగలక్ష్మి, పావని, జయమ్మ, ద్రాక్షమ్మకు గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో కర్నూల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సరోజమ్మ, జయమ్మకు సర్జరీ చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. స్వల్ప గాయాలు అయిన 13 మంది ఎక్స్‌రే తీయించుకుని స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నలుగురికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో వారు ఇంటికి వెళ్లిపోయారు. ఎవరికి ప్రాణాపాయం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. కర్నూలులో చికిత్స పొందుతున్న మహిళలను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు.

రామన్‌పాడులో 1,010 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం తగ్గుతుంది. గురువారం 1,010 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

సమాచార హక్కు చట్టంపై నిర్లక్ష్యం తగదు

మహబూబ్‌నగర్ రూరల్: సమాచార హక్కు చట్టం ప్రకారం దేశ పౌరులందరూ సమాచారం పొందే హక్కు ఉందని, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోగా, 30 రోజుల్లో ఇవ్వాల్సిన సమాచారాన్ని నెలలు గడిచినా ఇవ్వడం లేదని చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. సెక్షన్ 19 (1) ప్రకారం మొదటి అప్పీల్ కూడా సమాచారం ఇవ్వట్లేదని, అలాగే సెక్షన్ 19 (3) ప్రకారం రెండవ అప్పీల్ చేస్తే స్టేట్ కమిషన్ కార్యాలయంలో కమిషనర్లు లేక వేల దరఖాస్తులు పరిష్కారం కావడం లేదన్నారు. చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాక ప్రభుత్వం వెంటనే సమాచార హక్కు చట్టం కమిషనర్లను నియమించాలని కోరారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- విద్యుత్ స్తంభానికి తెగిన వైర్లు తగిలి యువకుడు మృతి
- కొడుకును కోల్పోవడంతో అనాథగా మారిన తల్లి



రాము (ఫైల్)



ఘటనాస్థలంలో తేలి ఉన్న విద్యుత్ వైర్లు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని విద్యుత్ స్తంభానికి వైర్లు తేలి ఉండటంతో తగిలి షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరా నగర్‌కాలనీలో నివాసముండే రాము (21) నాగర్‌కర్నూల్ రోడ్డులోని వైన్స్ వద్దకు గురువారం రాత్రి వర్షం ముగిసిన తర్వాత వచ్చాడు. వర్షం పడటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడిన తర్వాత కొద్ది సేపటికి విద్యుత్ పునరుద్ధరించారు. యువకుడు అక్కడే వారి మిత్రులను కలిసేందుకు బైక్‌పై వచ్చిన యువకుడు బండి స్టాండ్ వేసే క్రమంలో అక్కడే ఉన్న విద్యుత్ స్తంభం వద్ద తేలిఉన్న వైర్లు తగిలి రాము అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే ఉన్న వారు భారీ కర్ర సాయంతో అతన్ని దూరం కదిలించిన అప్పటికే మృతి చెందాడు. వైన్స్ వద్ద ఉన్న స్తంభానికి వైర్లు తేలి ఉన్నాయని గతంలో ఓ నాయకుడు, అక్కడి కాలనీవాసులు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వెరసి నిండు ప్రాణం బలైపోయింది. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌చేసినా అతని ఫోన్ అందుబాటులోకి రాలేదు.

అనాథగా మారిన తల్లి..

రాము చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవటంతో తల్లి కూలీ పనులను చేస్తూ అతనిని పెంచింది. కుమారుడు పెద్దయ్యాక అతనూ కూలీ పనులను చేస్తూ తన తల్లికి ఆసరాగా ఉన్నాడు. వర్షం తగ్గాక ఇప్పుడే వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాము విగతజీవిగా మారాడని తల్లికి తెలియటంతో ఆమె రోదన అక్కడ ఉన్నవారిని కలిచివేసింది. రాము మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతిపై ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేసి విచారణ చేపడతామని పోలీసులు తెలిపారు.

పనులకు వెళ్లిన ఇద్దరు అదృశ్యం



బోయ లక్ష్మన్న



బోయ సర్దార్ సవారన్న

ధరూరు: కూలీ పనికి వెళ్లి ఒకరు.. హమాలీ పనికి వెళ్లి మరొకరు కనిపించకుండా పోయిన ఘటన మండలంలోని పెద్దపాడులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపాడుకు చెందిన బోయ లక్ష్మన్న ఈ నెల 3వ తేదీన గద్వాల పట్టణంలో హమాలి పని చేసేందుకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో వెతికినా ప్రయోజనం కనిపించలేదు. అదే గ్రామానికి చెందిన బోయ సర్దార్ సవారన్న ఈ నెల 3వ తేదీన ఉదయం గద్వాల పట్టణంలో కూలీ పని చేసేందుకని వెళ్లాడు. ఆయన కూడా ఇంటికి తిరిగి రాలేదు. గురువారం లక్ష్మన్న కుమారుడు హరికృష్ణ, సర్దార్ సవారన్న అల్లుడు బోయ ఆంజనేయులు వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఎక్కడైనా కనిపిస్తే 8712670293 నంబరుకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఒకే గ్రామంలో ఒకే రోజు ఇద్దరు కనిపించకుండాపోవడంతో ఇరు కుటుంబాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

ఓటేసేందుకు వచ్చిన మహిళ అదృశ్యం



మహేశ్వరి

రాజోళి: అయిజ మండలం ఉప్పల నుండి రాజోళిలో ఓటేసేందుకు వచ్చిన వివాహిత అదృశ్యమైంది. ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కుర్వ సుధాకర్‌కు అయిజ మండలం ఉప్పలకు చెందిన కుర్వ మహేశ్వరితో వివాహమైంది. తన భర్త సక్రమంగా ఉండటం లేదని ఆమె తన పుట్టినిల్లు ఉప్పలలోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 13న ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాజోళికి వచ్చి, ఓటు వేసిన అనంతరం ఆటోలో వెళ్లిపోయిందని, కాని తన పుట్టినింటికి కూడా వెళ్లలేదని, భర్త ఇంటికి రాలేదని భర్త సుధాకర్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూడు వారాల ఉత్కంఠ

- ఎన్నికల ఫలితాల కోసం ఎదురుచూపు
- నేతలకు టెన్షన్.. పనులకు ఆటంకం



అచ్చంపేట: నేతల తలరాతలు మార్చే సమయం కోసం మరో 20రోజులు వేచి చూడాల్సిందే. లోక్‌సభ ఎన్నికలు ముగిసినప్పటికీ, ఫలితాలు వెలువడేందుకు జూన్ 4 వరకు ఆగాల్సిందే. అప్పటి వరకు వేచి ఉండాల్సి ఉంటడంతో విహారయాత్రలకో, ఇతరత్రా పనులకో కేటాయించేందుకు కొందరు నేతలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సన్నిహితుల ప్రొద్బలంతో యాత్రలకు వెళ్లినా ఫలితాలు తెలిసేంతదాకా మనశ్శాంతితో ఉండలేమని భావిస్తున్నవారు ఉన్నారు. ప్రస్తుతానికి పోలింగ్ సరళి.. తమకు ఎక్కడెక్కడ ఓట్లు పడ్డాయి. ఎక్కడ పడలేదో అంచనాలు వేస్తున్నారు.

కాలక్షేపమెట్ల..

ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్న వివిధ పార్టీల కార్యకర్తలు ఇప్పుడు ఫలితాలపై అంచనాలు వేస్తూ దిక్కులు చూస్తున్నారు. నిత్యం సాయంత్రం కాగానే మందు, విందులతో గడిపిన వారు ఎన్నికల ఫలితాలకు 20రోజులు గడువు ఉండటంతో నేతలెవరూ అందుబాటులోకి రాక వారిని పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రచారంలో భాగంగా పార్టీ జెండాలు పట్టుకుని తిరిగేందుకు కార్యకర్తల ఖర్చులకు డబ్బులు ఇచ్చారు. ప్రచారంలో భాగంగా ముఖ్యమైన సభలకు జనసమీకరణ పేరిట డబ్బులు దండుకున్నారు. ఇప్పుడు ఎన్నికలు అయిపోగానే నేతలెవరూ ఇందుబాటులోకి రాక కార్యకర్తలకు ఏం చేయాలో తెలియడం లేదు.

కోడ్ గండం..

రాజకీయ నేతల పరిస్థితి అలా ఉండగా, మున్సిపాలిటీల్లో ప్రజలకు అవసరమైన వివిధ పనులు చేయాల్సిన కొత్తగా ఏ పనులు చేపట్టలేని పరిస్థితి. జూన్ 6వతేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. అప్పటి దాకా స్టాండింగ్ కమిటీ సమావేశాల నిర్వహణకు, కొత్తగా పనులు ఆమోదానికి, పథకాల ప్రారంభానికి అవకాశం లేదు. పోలింగ్ తేదీకి దాదాపు రెండు నెలల ముందుగానే ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో అప్పటి నుంచే ఇవి నిలిచిపోయాయి.

పనులయ్యేనా?

జూన్ మొదటి వారంలో వర్షాకాలం అరంభమవుతుంది. వివిధ పనులు ఆలోపునే పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే మంజూరై, పురోగతిలో ఉన్న పనులు సైతం మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వ విభాగాల సిబ్బంది ఎన్నికల విధుల్లోనే ఉండటంతో పనులు కుంటుపడ్డాయి. వర్షాకాలానికి సంబంధించిన నాలాల పూడికతీత, ఎస్‌ఎన్‌డీపీ పనులు సైతం పూర్తి కాలేదు. అత్యవసరమైన పనులకు సైతం ఎన్నికల సంఘం నుంచి ప్రత్యేకంగా అనుమతి పొందాల్సి ఉంటుంది. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు నిర్వహించే ప్రజావాణి సైతం ఉండదు.

గడ్డివాములు దగ్ధం

దామరగిద్ద: నిప్పంటుకుని గడ్డివాములు దగ్ధమైన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. కాన్‌కుర్తికి చెందిన కుర్వ మనెప్ప పశుగ్రాసాన్ని ఇంటిముందు నిల్వచేసుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో గడ్డివాములకు నిప్పంటుకుంది. అగ్నిమాపక సిబ్బంది ఫైర్‌ఇంజన్‌తో మంటలను అదుపుచేశారు. అప్పటికే పశుగ్రాసం పూర్తిగా కాలిబూడిదైంది. తమ దాయాదులే నిప్పంటించి ఉంటారని కుర్వ మనెప్ప వారితో గొవడకు దిగారు. గ్రామస్తులు సముదాయించడంతో శాంతించారు. పశువుల కోసం నిల్వ చేసిన రూ.50వేల విలువ చేసే పశుగ్రాసం కాలిపోయిందని బాధితుడు వాపోయాడు.

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు

- రైతులు విత్తనాల కొనుగోలుపై అవగాహన ఉండాలి
- దుకాణదారుడి నుంచి రశీదు తప్పనిసరి
- జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్

నారాయణపేట/మక్తల్: రైతులకు నాసిరకం విత్తనాలు అమ్మితే విజిలెన్స్ బృందాల ద్వారా తనిఖీలు చేసి.. దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ అన్నారు. గురువారం మక్తల్ మండలం జక్లేర్ రైతు వేదికలో మక్తల్, మాగనూర్, కృష్ణ, నర్వ, ఊట్కూర్ మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులు, ఫర్టిలైజర్, విత్తనాల డీలర్లతో ప్రత్యేక సమావేశంతోపాటు ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలన్నారు. పాతస్టాక్ స్థానంలో కొత్తస్టాక్ ఏర్పాటు చేయాలని, ఎవరైనా పాత స్టాక్ విక్రయిస్తే విజిలెన్స్ బృందాలతో తనిఖీలు నిర్వహించి కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాలని, గ్రామాల్లో ఎవరైన లూజు విత్తనాలు అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు. రైతులు ఎమైన వ్యవసాయ పనులు చేస్తే అధికారుల సలహాలు తీసుకొని పనులు చేయాలని కోరారు. కార్యక్రమంలో మక్తల్ ఏఓ మితన్‌చక్రవర్తి, గణేస్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

- వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధికృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- గ్రామాల్లో రాత్రికి రాత్రి వచ్చి విక్రయించే నకిలీ విక్రయిదారుల నుంచి ఎట్టి పరిస్థితుల్లో విత్తనాలు కొనుగోలు చేయరాదు.
- బిజి–3 పేరుతో చలామణి అవుతున్న పత్తి విత్తనాలకు అనుమతి లేనందున ఈ రకం విత్తనాలను కొనడం, అమ్మడం నేరం.
- నిర్ణీత ఫార్మాట్ లో ఉన్న బిల్లు (రసీదు) అనగా దుకాణదారుని అడ్రస్ పేరు సీడ్ లైసెన్స్‌నంబరు జీఎస్టీ నంబరు మొదలగునవి ఉన్న రసీదును అంగీకరించాలి.
- విత్తన కంపెనీ పేరు విత్తన రకంపేరు, లాట్ నెంబరు, గడువు తేదీ, డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు మరియు పగిలిన పాకెట్లు డబ్బాల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదు.
- గడువు దాటిన విత్తనాలను ఎట్టి పరిస్థితులలో కొనరాదు. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్ సంచి డబ్బాలపై సీలు ఉందా లేదా అని సరిచూసుకోవాలి. విత్తన పాకెట్లపై ముద్రించిన సమాచారాన్ని బిల్లులో ఉన్న వివరాలతో సరిచూసుకోవాలన్నారు.
- విత్తన ప్యాకెట్ బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవడం ద్వారా జన్యు స్వచ్ఛత లోపాల వల్ల లేదా మొలక శాతం తక్కువైనప్పుడు తగిన పరిహారం కోరే హక్కు రైతుకు ఉంటుంది.